క్లుప్తంగా

ఏనుగుల సంచారంపై అప్రమత్తం



పేగలవారిపల్లె అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న జంట ఏనుగులు

సోమల: అటవీ సమీపంలో వ్యవసాయ భూములు కలిగిన రైతులు అప్రమత్తంగా ఉండాలని కందూరు బీట్ అటవీశాఖ ఎఫ్‌బీఓ మునిరాజ కోరారు. శుక్రవారం మండలంలోని తమ్మినాయనిపల్లె పంచాయతీ పేగలవారిపల్లె అటవీ ప్రాంతంలో జంట ఏనుగుల సంచారాన్ని స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన అధికారులు ఏనుగులు పొలాల వైపు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపిక

కుప్పం: పట్టణంలోని ఐఆర్‌ఎం విద్యాసంస్థలో శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించినట్టు చైర్మన్ దయానిధి తెలిపారు. పేరొందిన పలు ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. ప్రతిభ, అర్హత ఆధారంగా 19 మంది విద్యార్థులను వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారని చెప్పారు. ఎంపికైన వారంతా చెన్నైలో పనిచేయాల్సి ఉంటుందని, రూ.20 లక్షల నుంచి రూ.24లక్షల వరకు వార్షిక వేతనంవీరికి ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ యూనిఫాం వితరణ



యూనిఫాం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధి మేరీ

శాంతిపురం: రాళ్లబూదుగూరు జెడ్పీ హైస్కూలులోని స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందానికి మేరీ ట్రస్ట్ వితరణతో యూనిఫాం పంపిణీ చేశారు. శుక్రవారం ఆ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యూనిఫామ్‌ను ట్రస్ట్ ప్రతినిధి మేరీ, హెచ్‌ఎం రామచంద్రయ్య తదితరుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. యూనిఫాం కొనుగోలుకు ట్రస్ట్ ప్రతినిధి రూ.24 వేలను అందజేశారని కృతజ్ఞతలు తెలిపారు. మేరీ మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, దేశ భక్తిని పెంచేందుకు స్కౌట్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. పెద్దలు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం చిన్నతనం నుంచే నేర్పాలని కోరారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు సిద్దారెడ్డి, ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

పలమనేరు: కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని ఇమ్మాస్ ఆస్పత్రి వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన దేవరాజులు(62) గ్రామంలోని సమీపంలోని కుప్పం- పలమనేరురోడ్డులోకి బైక్‌పై వస్తుండగా పలమనేరు వైపు వస్తున్న కారు అతడిని ఢీకొంది. దీంతో కారుపై ఎగిరి పడి దేవరాజులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని పలమనేరు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను పెద్దాసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

శిక్షణతో స్వయం ఉపాధి



సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులతో స్కిల్‌హబ్ అధికారులు

పలమనేరు: శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చని స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ సుబ్బయ్య నాయుడు అన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30మందికి శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేసి ఆయన మాట్లాడారు. ఇక్కడ శిక్షణ పొందిన చాలామందికి ఉపాధి కల్పించామన్నారు. వారంతా ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారన్నారు. శిక్షణతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిక్షణ పొందడానికి ఆసక్తి కలిగిన వారు తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం పాల్గొన్నారు.

ఉత్తములకు సన్మానం



ఎంఈఓ, సీఆర్పీని సన్మానిస్తున్న వివిధ ఉపాధ్యాయ సంఘాలు

పలమనేరు: ఇటీవల ఉత్తమ ఎంఈఓగా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకున్న స్థానిక ఎంఈఓ లీలారాణి, సీఆర్పీ గీతను మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు శుక్రవారం మండల వనరుల కేంద్రం వద్ద ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో మరింత బాధ్యతలు ఇవి పెంచుతాయని ఎంఈఓ, సీఆర్పీ చెప్పారు.

డ్రాగన్..ఆదాయంలో డాన్

కుప్పం నియోజక వర్గంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు రోజు రోజుకూ విస్తరిస్తోంది. నాలుగేళ్ల క్రితం జిల్లాలో మొదలైన డ్రాగన్‌ఫ్రూట్ పంట మారుమూల కుప్పంలో సాగు పెరుగుతోంది. ఇరవై ఏళ్ల వరకు దిగుబడి ఇవ్వడం, సాగుకు మిగిలిన పంటల తరహాలో నీటి అవసరం లేకపోవడం, తెగుళ్ల బెడద తక్కువ ఉండడంతో రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా ఈ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీ రెట్టింపు చేయడంతో రైతాంగం ఉత్సాహం చూపుతోంది.

- కుప్పంలో విస్తరిస్తున్న డ్రాగన్ ఫ్రూట్ సాగు
- నీరు, తెగుళ్ల బెడద తక్కువ.. రైతాంగం ఆసక్తి
- 20 ఏళ్ల పాటు దిగుబడి
- సబ్సిడీ రెట్టింపు చేసిన ప్రభుత్వం
- పొలాల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- పెరటిలోనూ సాగుకు మొగ్గు చూపుతున్న ప్రజలు
- కుప్పం మార్కెట్‌లో కిలో రూ.200 పలుకుతున్న డ్రాగన్ ఫ్రూట్

కుప్పం రూరల్: కరువు ప్రాంతమైన కుప్పంలో వర్షాధార పంటలే ఎక్కుగా సాగు చేయడం పరిపాటి. వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు ప్రత్నామాయ పంటల సాగుపై దృష్టి సారిస్తారు. ఇలాంటి తరుణంలో రైతులకు డ్రాగన్ ఫ్రూట్ ఆశాజనకంగా కనిపించడంతో దీనిపై మొగ్గు చూపారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దిగుబడి ఆరు



విరబూసిన డ్రాగన్ ఫ్రూట్ పూలు



సోమాపురం వద్ద సాగువుతున్న పంట



డ్రాగన్‌ఫ్రూట్ తోటలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారులు

నెలల నుంచే ప్రారంభమై 20 ఏళ్ల వరకు వచ్చే అవకాశం ఉండడంతో సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి పండ్లను కొనుగోలు చేస్తుండడంతో మార్కెట్ భయం లేకపోతోంది. స్థానిక మార్కెట్‌లో కిలో రూ.200 వరకు పలుకుతుండడంతో స్థానిక వ్యాపారులు కొంత వరకు కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు సైతం స్థానికంగా వ్యాపారుల నుంచి కొంటున్నారు. మరి కొందరు తమిళనాడు రాష్ట్రం హొసూరు, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తెచ్చుకుంటున్నారు.

ఎకరాలకు రూ. 4 లక్షల ఖర్చు

డ్రాగన్ ఫ్రూట్ ఎకరా విస్తీర్ణంలో సాగుకు అన్ని ఖర్చులూ కలుపుకుని రూ.4 లక్షల వరకు వ్యయం అవుతోంది. ఒక్కో మొక్క ధర రూ.90 ఉండగా, ఎకరాకు 2,600 మొక్కలు, అలాగే 600 స్తంభాలు నాటాల్సి ఉంటుంది. ఒక్కో స్తంభం రూ.700 పలుకుతోంది. ఒక్కో స్తంభం నాలుగు మొక్కలకు అండగా ఉంటుంది. ఎరువులు పెద్దగా అవసరం లేకపోవడం, నీరు చాలా తక్కువగా ఉన్నా సరిపోతుంది. తెగుళ్ల ఆశించడం అరుదనే చెప్పాలి.

రైతులకు ప్రోత్సాహం

గత ప్రభుత్వాల హయాంలో డ్రాగన్ ఫ్రూట్ రైతులకు మొదటి సంవత్సరం ప్రోత్సాహం కింద రూ.18 వేలు ఇచ్చేవారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక దీనిని రెట్టింపు చేసింది. మొదటి సంవత్సరం హెక్టారుకు రూ.30 వేలు, రెండవ సంవత్సరం రూ.10 వేలను ఇస్తోంది. జూన్, జూలైలో నాట్లు మొదలై నవంబర్‌కు దిగుబడి వచ్చే ఈ పంటలకు ఆ సమయంలోనే సబ్సిడీ మొత్తం అందుతోంది. దీనికి తోడు ఉద్యానశాఖ అధికారులు ఎప్పటి కప్పుడు రైతులకు సలహాలు-సూచనలు ఇస్తుండడంతో ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది. మొక్కలు నాటిన నాటి నుంచి దిగుబడి, మార్కెట్ వరకు అధికారులు సహాయ సహకారాలు అందుతుండడంతో సాగు పెరుగుతోందనే చెప్పాలి.

పెరట్లోకి సైతం..!

ఎక్కడో చైనాలో మొదలైన డ్రాగన్ ఫ్రూట్ పంట దేశాలు దాటుకుని గ్రామీణ ప్రాంతమైన కుప్పంలోని ఇళ్ల ముందు పెరట్లోకి సైతం చేరింది! అధిక పోషకాలు ఉండడం, వ్యాధులను నిరోధించే వైటమిన్లు దీనిలో పుష్కలంగా ఉండడంతో చాలా మంది మహిళలు తమ ఇళ్ల పెరట్లో ఈ మొక్కలను పెంచుతుండటం విశేషం! ఐరన్, న్యూట్రీషియన్లు, యాంటీ యాక్సిడెంట్స్ ఎక్కువగా ఉండి రుచిగా ఉండడంతో వయోభేదం లేకుండా దీనిని తినేందుకు ఇష్టపడుతున్నారు.



బంగారునత్తం వద్ద పెరట్లో పెంచుతున్న డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు

ఇక్కడే మొక్కల ఉత్పత్తికి యత్నం



ఒక్కసారి వేస్తే 20 ఏళ్ల వరకు డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి వస్తుండడంతో రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. తెగుళ్ల బెడద లేకపోవడం, మార్కెట్ సదుపాయం ఉండడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం కూడా రెండేళ్ల పాటు సబ్సిడీ ప్రోత్సాహకాలు ఇస్తోంది. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లోను డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. – డింపుప్రియ, హార్టికల్చర్ అధికారి, కుప్పం

మార్కెటింగ్ సమస్యే లేదు



డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయడానికి ఒక్కసారి ఎకరాకు 4 లక్షల రూపాయలు ఖర్చు పెడితే చాలు. మళ్లీ మళ్లీ పెట్టాల్సి అవసరమే లేదు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట 20 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. వ్యాపారులు పొలాల వద్దే కొంటున్నారు. దీనివల్ల మాక్కు మార్కెటింగ్ సమస్యే లేదు.
–కుమారస్వామి, డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతు, కొత్తయిండ్లు

పిల్లలు ఇష్టంగా తింటారు



మా పిల్లలు డ్రాగన్ ఫ్రూట్‌ను ఇష్టంగా తింటారు. అందుకే మా ఇంటి పెరట్లో మొక్కలను తెచ్చినాటాం. చాలా మంది ఇది చూసి ఆసక్తిగా మమ్మల్ని అడుగుతున్నారు ఎట్లా పెంచాలి వీటినీ అని. మేము వాళ్లకు చెబుతుండడంతో వాళ్లు కూడా పెరట్లో పెంచేందుకు ఉత్సాహం చూపుతున్నారు.
కాంతరాజ్, పెద్దబంగారునత్తం

మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం



తంబిగానిపల్లెలో చీరల బ్యాగులు చూపుతున్న మహిళల మధ్య దుర్గ, పార్టీ నాయకులు

కుప్పం: అందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని తంబిగానిపల్లె, అనిమిగానిపల్లెలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పలకరించారు. మహిళలకు చీరలు అందజేసి మాట్లాడారు. పార్టీలకు, కులమతాలకతీతంగా వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలకు చెల్లుచీటీ పాడుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మంచి చేసిన వైఎస్సార్ సీపీని మరోసారి ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఇళయరాజ్, నాయకులు సీపీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన

పలమనేరు: ఓటుహక్కు వినియోగంపై ఓటర్లు, రాజకీయ పార్టీ నాయకులకు శుక్రవారం మున్సిపల్ సెక్టోరియల్ అధికారులు ఈవీఎంలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 229, 230, 231 బొమ్మిదొడ్డి, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ పోలింగ్ కేంద్రాల్లో సెక్టోరియల్ అధికారులు, బీఎల్వోలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాక్ పోలింగ్ నిర్వహించి ఓటర్ల అనుమానాలను నివృత్తి చేశారు. మున్సిపాలిటీలోని 41 పోలింగ్ కేంద్రాలలో ఈనెల 15 వరకూ ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని సంబంధిత అధికారులు చెప్పారు. పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



బొమ్మిదొడ్డి పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఎమ్మెల్సీ భరత్ ఆర్థిక సాయం

రామకుప్పం: స్థానిక మిట్టపల్లెకు చెందిన చంద్రప్ప శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ ఆ గ్రామానికి వెళ్లారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం మృతుని కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, యువత మండల అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ రామిరెడ్డి, మధు, అంజి, ప్రకాష్, మురుగ పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్

తహసీల్దార్లకు వీడ్కోలు సన్మానం



సీతారామన్‌ను సన్మానిస్తున్న దళిత నేతలు



రొంపిచెర్లలో..

పుంగనూరు: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సీతారామన్‌ను దళిత సంఘ నేతలు రాజా, శంకరప్ప, పెంచుపల్లి కృష్ణప్ప తదితరులు గురువారం రాత్రి వీడ్కోలు సన్మానం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించి ఆయన సేవలను ప్రస్తుతించారు.ఎస్సీ, ఎస్టీలకు, బడుగు బలహీన వర్గాలకు ఆయన మేలు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు శ్రీనివాసులు, రమణ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ అమరనాథ్‌ను రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఆయన వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అవడం విదితమే. ఉద్యోగులు, ప్రజలు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీలు లోకేష్, వెంకటరమణా రెడ్డి, ఆర్‌ఐ అబ్దుల్ ఖాదర్, వీఆర్వోలు ప్రసాద్, ముబారక్, పల్లవి, ఎల్లప్ప, సురేంద్ర, శ్రీనివాసులు, వెంకటరమణ, గ్రామ సచివాలయాల సర్వేయర్లు, పలువురు నాయకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

సోమల: 2022-23 వరకు చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ శనివారం మండల పరిషత్ కార్యాలయ ం వద్ద నిర్వహించనున్నట్లు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ దినకర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనాలని కోరారు.

భక్తిప్రపత్తులతో అక్కదేవతల ప్రతిష్ఠాపన



అక్కదేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో గ్రామస్తులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో శుక్రవారం అక్కదేవతల ప్రతిమల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అక్కదేవతల ప్రతిమలను గ్రామస్తులు ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ సమీపంలోని పొలాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్థలంలో ప్రతిష్ఠించారు. అనంతరం విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం చేశారు.

357 మందికి వైద్య పరీక్షలు



రోగుల వైద్య రిపోర్టును పరిశీలిస్తున్న వైద్యాధికారి

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహించారు. 357 మందికి వైద్యాధికారులు శ్యామలా దేవి, గ్రీష్మాబిందు, టి.మురళి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, 40 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 25 మందిని కళ్ల అద్దాల కోసం రెఫర్ చేశారు. ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఎంపీటీసీ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పార్టీ నాయకులు ధనంజయ, రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన



మతుకువారిపల్లెలో పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పులిచెర్ల(కల్లూరు): జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ(డీఎల్‌డీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం మతుకువారిపల్లెలో పశువైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ప్రారంభించారు. దాదాపు 500వందల పశువులను శిబిరానికి తీసుకువచ్చారు.పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ మాట్లాడుతూ, మేలురకం జాతి పశువులతో అధిక పాల దిగుబడి పొందవచ్చన్నారు. అధిక పాల దిగుబడి సాధిస్తున్న రైతులకు ప్రోత్సాహకాలను అందజేశారు. మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ సంతోష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గోవిందరెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దపంజాణి బాలికల జట్లు



జిల్లాస్థాయి క్రికెట్ పోటీలలో విజేతగా నిలిచిన పొట్టగానిపల్లె జట్టు



వాలీబాల్ పోటీలలో విజేత నిలిచిన నేలపల్లె జట్టు

పెద్దపంజాణి: ఇటీవలే చిత్తూరులో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడాపోటీల మహిళల విభాగం వాలీబాల్, క్రికెట్ పోటీలలో పెద్దపంజాణి మండలం జట్లు విజయం సాధించినట్లు ఎంపీడీఓ అబ్దుల్‌రహీం శుక్రవారం తెలిపారు. కోగిలేరు సచివాలయం పరిధిలోని పొట్టగానిపల్లె గ్రామ బాలికల జట్టు క్రికెట్‌లో, కొళత్తూరు సచివాలయం పరిధిలోని నేలపల్లె బాలికల జట్టు వాలీబాల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి మండలానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి, ఎంపీటీసీ పరంధామ, సర్పంచులు రమేష్‌బాబు, రవికుమార్, పీడీలు తులసీరాం , అన్నాదొరై, పీఎస్‌లు మహేష్‌కుమార్, వరలక్ష్మి, గ్రామస్తులు వారిని అభినందించారు.

ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. కుప్పంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, బెంగుళూరు సినాప్సిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. తమ కళాశాలతో పాటు వివిధ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, హైస్కూల్ విద్యార్థులు కలిసి తయారుచేసిన 70 ప్రాజెక్టులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు. పలమనేరు నియోజకవర్గ పరిసరాల్లోని హైస్కూల్ విద్యార్థులు పెద్దసంఖ్యలో ఎగ్జిబిషన్‌కు హాజరై ప్రాజెక్టులను పరిశీలించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

పీహెచ్‌సీలో అదనపు గది ప్రారంభం

- గది నిర్మాణానికి ఆస్పత్రి స్థల దాత ఔదార్యం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దాత పుట్టా సుబ్బరాజ సహకారంతో రూ.5లక్షలతో నిర్మించిన అదనపు గదిని శుక్రవారం దాత చేతుల మీదుగా ప్రారంభించారు. ఈఆరోగ్య కేంద్ర నిర్మాణానికి సైతం తన తల్లిదండ్రుల స్మారకార్థం సుబ్బరాజ అప్పట్లో స్థలదానం కూడా చేశారు. అదనపు గది నిర్మాణంతో మరింత సౌకర్యం కలిగిందని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వడానికి వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు, విశ్రాంత డాక్టర్ లియాఖత్, సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, వాసవీ క్లబ్ చైర్మన్ బాలాజి, ఆర్‌ఎస్ రాజన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అదనపు గదిని ప్రారంభిస్తున్న దాత పుట్టా సుబ్బరాజ

హాస్టళ్లలో శుభ్రత ముఖ్యం

సదుం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీష అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లలో శుక్రవారం దోమల నిర్మూలనకు మొలాథిన్ ద్రావణం పిచికారీ చేశారు. పనులను పర్యవేక్షించిన ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, హాస్టళ్లలో మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాగర్, హెల్త్ సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్, సీహెచ్‌ఓలు రషీద్, శ్రావణి, సిబ్బంది రేవతి, షరీఫ్ పాల్గొన్నారు.



పిచికారీ పనులను పరిశీలిస్తున్న డాక్టర్ గిరీష

జగనన్నతోనే మహిళాభ్యున్నతి

కుప్పం రూరల్: మహిళాభ్యున్నతి జగనన్నతోనే సాధ్యమని కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ క్యాంపు కార్యాలయంలో గర్భవతులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.. ఒక్కో మహిళకు రాగిపిండి 2 కిలోలు, పాలు 5 లీటర్లు, బియ్యం 3 కిలోలు, పప్పు 1 కిలో, నూనె 500 గ్రాములు, గుడ్లు 25 చొప్పున అందజేసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రతి పథకాన్ని మహిళలను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నారని, మహిళాభ్యున్నతితోనే కుటుంబాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నదే సీఎం ఉద్దేశమన్నారు. మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని నమ్మిన వ్యక్తిగా పేర్కొన్నారు. కౌన్సిలర్లు నాగరాజు, అరవింద్, రాజ్‌కుమార్, విజయ్, సయ్యద్ ఆలీ, సీడీపీఓ అరుణశ్రీ, సూపర్‌వైజర్ దిల్‌షాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్